క్లుప్తంగా

ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఎమ్మెల్యే అభినందన

వర్ధన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రకటించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరు వెంకట్‌లను అసెంబ్లీ ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు గురువారం కలిసి అభినందించారు. తొలుత వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వాటర్ ప్లాంట్‌కు అవార్డు



వర్ధన్నపేట: మండలంలోని బండౌతపురం గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్‌కు ఉత్తమ వాటర్ ప్లాంట్‌గా అవార్డు దక్కింది. గ్రామంలో బాలవికాస సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ క్రమశిక్షణతో ప్రజలకు మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా నీటిని అందించి గ్రామస్తుల మన్ననలు పొందుతోంది. ఈ క్రమంలో కాజీపేటలోని ఆ సంస్థ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సదస్సులో వ్యవస్థాపక అధ్యక్షురాలు బాలథెరిస్సా జింగ్రాస్ చేతుల మీదుగా నిర్వాహకులు అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సభ్యులు నిర్మల, మౌనిక, అరుణ, లక్ష్మి, కోమల, రేఖ, రాజేశ్వరి, పూల, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా రామారావు నియామకం



చెన్నారావుపేట : పార్లమెంటరీ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైగా బి.రామారావు నియమితులయ్యారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఆయన్ను మండలంలోని పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్ కిషోర్ ఝా ఆదేశాలు జారీ చేశారు. మండలంలో ఎస్సైగా పని చేసిన వస్రం శ్రీనివాస్‌ను హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

ఆర్థికసాయం

రాయపర్తి: మండలంలోని కాట్రపల్లి సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, ఉప్పలయ్య తండ్రి సోమయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి విక్టరీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రూ.5 వేల సాయం అందించారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నేటి నుంచి జీపీడీపీ సభలు

చెన్నారావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో నేటి (శుక్రవారం) నుంచి గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (జీపీడీపీ) సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గ్రామసభలకు హాజరుకావాలని సూచించారు. నేడు ఖాదర్‌పేట, గొల్లపల్లి, సూర్యపేట తండా, గొల్లభామతండా, అమీనాబాద్, పత్తినాయక్‌తండా, తోపనగడ్డ తండా, కందిగడ్డ తండా, పుల్లయ్యబోడు తండా, 16 చింతల్ తండా, బోడ మాణిక్యం తండా, చెరువు కొమ్ముతండా, ధర్మతండా, అమృతండా, పాపయ్యపేట, బోజేర్వులో సభలుంటాయని పేర్కొన్నారు. అలాగే 20న జోజిపేట నారాయణతండా, తిమ్మరాయినిపహాడ్, ఎల్లాయగూడెం, బాపునగర్, లింగగిరి, శంకరం తండా, జల్లి, చెన్నారావుపేట, అక్కల్‌చెడ, కోనాపురం, ఉప్పరపల్లి, కాల్‌నాయక్‌తండా, లింగాపురం, జీడిగడ్డతండాల్లో సభలు జరుగుతాయని వివరించారు. సభల్లో గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించనున్నట్లు తెలిపారు.

31 వరకే రేషన్ ఈ-కేవైసీ గడువు

సంగెం: రేషన్ డీలర్ల వద్ద ఈ-కేవైసీ చేయించుకునేందుకు ఈనెల 31 వరకు మాత్రమే గడువు ఉందని తహసీల్దార్ రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డులో పేరున్న ప్రతీఒక్కరూ గడువులోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో రేషన్ నిలిచిపోతుందని,ప్రభుత్వ పథకాలు పొందేందుకు అనర్హులుగా ప్రకటించబడతారని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి



సంగెంలో నివాళు లర్పిస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, వర్ధన్నపేట, ఖానాపురం, చెన్నారావుపేట, సంగెం మండలాల్లో టీటీడీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ 28వ వర్ధంతి సభలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎంగా ఎన్టీఆర్ అందించిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి



వర్ధన్నపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రఘుచందర్

వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని స్థానిక ఏసీపీ రఘుచందర్ కోరారు. 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఎస్‌బీఐ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. తద్వారా దేశ ఆర్థిక అభివృద్ధికి బాటలు వేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ యోజన, కృషి సంచాయ్ యోజన, దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన, రాష్ట్రీయ గోకుల్ మిషన్, ప్రధాన మంత్రి కౌశల్ యోజన, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్వచ్ఛభారత్ అభియాన్, ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన, నేషనల్ స్పోర్ట్స్ టాలెంట్ సెర్చ్ స్కీమ్, ప్రధానమంత్రి వీధి వ్యాపారుల ఆత్మ నిర్భర్ నిధి, తదితర సంక్షేమ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఆశ వర్కర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నివారణలో ప్రజలు కీలకం

నల్లబెల్లి: నేరాల నివారణలో ప్రజలు కీలకమని నర్సంపేట రూరల్ సీఐ పుల్యాల కిషన్ తెలిపారు. మండలంలోని లెంకాలపల్లిలో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన కళాజాతకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలు సమాజంలోని రుగ్మతలను, సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. ప్రజలు చైతన్యవంతులై అసాంఘీక శక్తులకు, నేరాల నివారణకు అడ్డుకట్ట వేయడంలో పోలీసు శాఖకు సహకరించాలని ఆకాంక్షించారు. యువత సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గుడుంబాకు బానిసైన యువకులు 35 ఏళ్ల వయస్సులోపే మృతి చెందుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. గంజాయి, డ్రగ్స్‌కు బానిసలు కావొద్దని కోరారు. గ్రామాల్లో సీసీ కెమారాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కళాకారులు మూఢనమ్మకాలు, గుడుంబా, గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైం, తదితర అంశాలపై కళారూపాలతో అవగాహన కల్పించారు. మాయలు, మంత్రాల పేరుతో భూత వైద్యులు చేసే విన్యాసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై సైనాల నగేశ్, కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, కళాకారులు విలియమ్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రత్నయ్య తదితరులు పాల్గొన్నారు



నల్లబెల్లి : మాట్లాడుతున్న సీఐ పుల్యాల కిషన్

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయం

● యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుమార్

పర్వతగిరి: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) పని చేస్తోందని జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మేకిరి దామోదర్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో మండల అధ్యక్షుడు పాక శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల్లో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, మూడు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరంగంటి సంపత్, ప్రధాన కార్యదర్శిగా గుండు కరుణాకర్, ఉపాధ్యక్షులుగా పరిమళ శివప్రసాద్, ఖతీజుల్ కుబ్రా, కోశాధికారిగా రమావత్ శ్రీనివాస్, కార్యదర్శులుగా బైరి తిరుపతి, పొడిచెట్టి ప్రసాద్, అరవింద్‌కుమార్, జన్నారపు నిర్మల ఎన్నికయ్యారు. అనంతరం మండల కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి, కరుణ, దుర్గాదేవి పాల్గొన్నారు.



పర్వతగిరి : ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గం

మండల కమిటీ ఎన్నిక

నల్లబెల్లి: టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా కోశాధికారి సయ్యద్ అబ్దుల్ రవూఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా నాంపల్లి రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎడవెల్లి రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా నల్లెల యాదగిరి, ఉపాధ్యక్షురాలిగా కనుకుల భారతి, కోశాధికారిగా రాయ బోస్, కార్యదర్శులుగా మడూరి అశోక్, షాకీర్ అలీ ఎన్నికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా కమిటీ ఎన్నికకు సహకరించిన జిల్లా కమిటీకి రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



తీగలను చూపుతున్న రైతు అమరేందర్

సంగెం: మండలంలోని మొండ్రాయిలోని పంట పొలాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని రైతులు బెంబేలెత్తుతున్నారు. ఆ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. లూజు లైన్లతో దుక్కి దున్నే ట్రాక్టర్లకు, పశువులకు, రైతులకు ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. మొండ్రాయిలోని ఎస్ఎస్ 41తోపాటుగా పంట పొలాల్లో వేలాడుతున్న తీగలను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

అక్రమ వెంచర్‌లో బ్యానర్లు, జెండాల తొలగింపు



దుగ్గొండి: మండలంలోని నాచినపల్లిలో గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా వ్యవసాయ భూమిలో వెంచర్ చేశారంటూ వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది హద్దురాళ్లు, బ్యానర్లు, జెండాలను తొలగించారు. సర్వే నంబర్ 514లోని 6 ఎకరాల వ్యవసాయ భూమిని కొందరు కొనుగోలు చేసి వెంచర్ చేశారు. హద్దురాళ్లు ఏర్పాటు వేసి ప్లాట్‌లుగా విభజించారు. బ్యానర్లు, ప్లాట్ల వద్ద రంగుల జెండాలు పాతి విక్రయాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే గ్రామ పంచాయతీ తీర్మానం లేదంటూ పలువురు వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బందిని వెంట తీసుకుని వెళ్లి హద్దురాళ్లు, బ్యానర్లను తొలగించారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పీఈటీలు

రాయపర్తి: మండలంలోని కొత్తూరు, కాట్రపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటినట్లు పీఈటీలు పుట్ట సమ్మయ్య, సుజాత తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో పీఈటీలు గురువారం అభినందించారు. అనంతరం పీఈటీలు సమ్మయ్య, సుజాత మాట్లాడారు. జనగామలో జరిగిన 67వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో వరంగల్ జిల్లా తరఫున బాలుర విభాగంలో బి.మల్లేశ్, గణేశ్, బాలికల విభాగంలో దివ్య పాల్గొని మొదటి, ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విద్యార్థులను ఎంఈఓ నోముల రంగయ్య, హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మీ, ఉపాధ్యాయులు అభినందించారు.

కుట్టు శిక్షణతో ఆర్థిక స్వావలంబన

సంగెం: కుట్టు శిక్షణతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించొచ్చని హనుమకొండ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఎన్.రామచంద్రరావు కోరారు. మండలంలోని కాపులకనిపర్తిలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు. నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్ గాలి భిక్షపతి, వెల్దండ సురేశ్ మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ లావణ్య, కుట్టు శిక్షకురాలు తోటకూరి మమత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ సుధ

'పల్లెదీపాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

దుగ్గొండి: మండలంలోని తొగర్రాయి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు చిలువేరు శ్రీనివాసులు రచించిన 'పల్లెదీపాలు' పాటల పుస్తకాన్ని హెచ్‌ఎం సంద్రగిరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాఠశాలలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాసులును హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఉపాధ్యాయులందరికీ శ్రీనివాసులు పుస్తకాలు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరాచారి, సారయ్య, సుశీల, రఘు, కౌర్, స్వప్న, ఐలయ్య, పద్మశ్రీ, వీరస్వామి, నీరజ, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

'సదరం'లో దివ్యాంగులకు వైద్యపరీక్షలు

వర్ధన్నపేట : పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన సదరం క్యాంప్‌లో 95 మంది దివ్యాంగులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 99 మంది స్లాట్ బుక్ చేసుకోగా శిబిరానికి 95 మంది హాజరై పరీక్ష చేయించుకున్నారు. అర్హులకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) నుంచి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పెన్షన్ విభాగ అధికారులు వెల్లడించారు. తదనంతరం పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. క్యాంప్‌లో వైద్యాధికారులు డాక్టర్ చందునాయక్, ఫిజియోథెరపిస్ట్ నర్సింహారెడ్డి, వేణు, సైకాలజిస్ట్ వీరయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి, డాక్టర్ భరత్, తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

'ఓటరు నమోదులో నిర్లక్ష్యం చేయొద్దు'

ఖానాపురం : ఓటరు నమోదులో నిర్లక్ష్యం చేయొద్దని తహసీల్దార్ కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదు చేసుకునేలా అర్హులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు నమోదు దరఖాస్తులను సకాలంలో తీసుకోవాలని చెప్పారు.

ప్రణాళికతోనే సమగ్రాభివృద్ధి

ఖానాపురం: ప్రణాళికలతోనే గ్రామాల సమగ్రాభివృద్ధికి బాటలు వేయొచ్చని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ సుమణవాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల తయారీపై గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నివేదికలు తయారు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ రవి, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కళాకారుడి మృతి

చెన్నారావుపేట: మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన కళాకారుడు, ప్రయివేట్ స్కూల్ బస్ డ్రైవర్ కనుగుల వేణు (43) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన ఉదయం గుండెపోటుకు గురికాగా నర్సంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. వేణు మృతదేహానికి ప్రజావాగ్గేయకారుడు గిద్దె రాంనర్సయ్య, సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపాల్ అండెం కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రమేశ్, డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున్ తదితరులు నివాళులర్పించారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

రాయపర్తి: మద్యం మత్తులో జరిగిన గొడవలో గాయపడిన పర్వతగిరి మండలంలోని అనంతారానికి చెందిన బేతి రాంచరణ్ (17) మృతి చెందినట్లు ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపారు. కొలన్‌పల్లిలో గొడవ జరిగి కర్ర తగిలి రాంచరణ్‌కు గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి పెద్దమ్మ కళమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఆలయాల శుభ్రతకు కృషి చేయండి'

వర్ధన్నపేట: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్న క్రమంలో ఆలయాల శుభ్రతకు ప్రజలు, కృషి చేయాలని బీజేపీ జిల్లా నేత కొండేటి శ్రీధర్ కోరారు. ఆ పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో, పరిసరాల్లో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్లను ఊడ్చారు. చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడారు. వారం రోజుల పాటు అన్ని గ్రామాల్లో, పుణ్యక్షేత్రాల వద్ద, పర్యాటక ప్రదేశాల్లో, ఆస్పత్రులు, స్కూళ్లు, వీధులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేయాలన్న ప్రధాని పిలుపు మేరకు పట్టణంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని శుభ్రం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి, నాయకులు కొండేటి సత్యం, తేజానాయక్, పెద్దూరి రాజ్‌కుమార్, ఐత రవి, మల్లెపాక అనిల్, కర్ర సోమిరెడ్డి, బోయినపెల్లి దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో శుభ్రం చేస్తున్న శ్రీధర్, నాయకులు

ఐక్యతతోనే హక్కుల సాధన



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్ గౌడ్, నాయకులు

● మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్

నెక్కొండ: ఐక్యతతోనే హక్కులను సాధించుకోగలమని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్ గౌడ్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో ఆ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గీతకార్మికులు ఐకమత్యంతో అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన నిర్మల్ జిల్లా మామడ మండలం కోరిటికల్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఏలేటి లింగారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపగాని వెంకటేశ్వర్లు, దొంతి సంతోశ్, మండల అధ్యక్షుడు లింగాల వెంకన్న, నాయకులు అంబాల రాంగోపాల్, గిరగాని శ్రీనివాస్, పలుసం నవీన్, పులి బాబు, బొమ్మెర శ్రీనివాస్, కక్కెర్ల ఐలయ్య, మాచర్ల రాజు పాల్గొన్నారు.

'సఖి'తో మహిళలకు సాంత్వన

గీసుకొండ: మహిళలకు సఖి కేంద్రం ద్వారా సాంత్వన లభిస్తుందని కౌన్సిలర్ సుధ తెలిపారు. మండలంలోని ఊకల్, ఎలుకుర్తి గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె అవగాహన కల్పించారు. మహిళా రక్షణ చట్టాలు, నిర్భయ, గృహ హింస, తదితర విషయాలపై వివరించారు. ఆపదలో ఉన్న మహిళలు హెల్ప్‌లైన్ నంబర్ 181, 0870-3571832 నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే సాయం అందిస్తామని చెప్పారు. అనంతరం హెల్ప్‌లైన్, సఖి సేవల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీఓఏలు జయలత, పద్మ, సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కౌన్సిలర్, తదితరులు

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

నల్లబెల్లి: రేపు (ఈనెల 20న) స్థానిక సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తామని చైర్మన్ తిరుమల్‌రావు, ఆ సంస్థ నర్సంపేట డీఈ సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడం, నూతన సర్వీస్ మంజూరు, అదనపు లోడు క్రమబద్ధీకరణ, సర్వీస్ పేరు మార్పు, వాడకానికి మించిన బిల్లులు, కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు తదితర సమస్యలపై వినియోగదారులు లిఖిత పూర్వకంగా సదస్సులో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. నల్లబెల్లి, నర్సంపేట, దుగ్గొండి మండలాల వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కేజీబీవీలో 'అసిస్టెంట్ కుక్'కు ఇంటర్వ్యూ



ఇంటర్వ్యూ చేస్తున్న త్రీమెన్ కమిటీ సభ్యులు

పర్వతగిరి : స్థానిక కేజీబీవీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టు భర్తీ కోసం త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇంటర్వ్యూ నిర్వహించారు. త్రీ మెన్ కమిటీగా తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ సంతోశ్‌కుమార్, ఎంఈఓ సత్యనారాయణ అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. మొత్తం 17 దరఖాస్తులు రాగా 12 మంది హాజరయ్యారు. దరఖాస్తుదారుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, వంట చేసిన ఆహార పదార్థాల డెమోను త్రీ మెన్ కమిటీ సభ్యులు ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పోరాటాల ఫలితంగానే నిధులు'



నర్సంపేట రూరల్ : పోరాటాల ఫలితంగానే ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ తెలిపారు. పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు కేటాయించాలని కోరుతూ పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినట్లు, నిరసనలు తెలిపినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. నిధులు మంజూరీకి కృషి చేసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్, తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.